క్లుప్తంగా

రోటరీ గవర్నర్‌కు సత్కారం

బోట్‌క్లబ్: స్థానిక రాంకోసా హాల్‌లో ఇటీవల రోటరీ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన వై.కల్యాణ్ చక్రవర్తిని శుక్రవారం నగరంలోని ప్రముఖ వైద్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి చిట్ల కిరణ్ మాట్లాడుతూ కల్యాణ్ చక్రవర్తి రంగరాయ వైద్య కళాశాల్లో వైద్య విద్య నభ్యసించి, ఎనస్థీషియాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా పొందన్నారన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లో ఎన్నో పదవులు సమర్ధవంతంగా నిర్వహించారన్నారు. ఎంతో మంది వైద్యులకు ఆయనొక దిక్సూచి వంటి వారన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, వైద్యులు వెంకటాచలం, ఆదిత్య, కాశీ, నర్సింగ్, శిరంగు దొరబాబు, ఫణి, మాతా శ్రీనివాస్, చల్లారావు, పుల్ల ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య


కల్యాణి (ఫైల్)

కాకినాడ రూరల్: మానసిక ఒత్తిడికి గురై ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. తిమ్మాపురం ఎస్సై గణేష్‌కుమార్ కథనం ప్రకారం.. అమలాపురానికి చెందిన కారం కల్యాణి (37) కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏఈగా పనిచేస్తున్నారు. నగరంలోని రామారావుపేట సుబ్బయ్య హోటల్ సమీపంలో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. అయితే రెండేళ్ల క్రితం తన భర్త పాము ఉదయ్‌కుమార్ చనిపోవడంతో మానసిక ఒత్తిడికి గురవుతోంది. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది చనిపోవాలని నిర్ణయించుకుంది. సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్ వద్దకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం ఉదయం ఆమె మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. తిమ్మాపురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి వివరాలు సేకరించారు.

పేదలకు నిత్యావసరాలు

కరప: మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ వితరణతో ఒక పేద కుటుంబానికి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరకులు సమకూర్చారు. కరప శివారు రామకంచిరాజునగర్ కాలనీ–2 చెందిన మోటూరి అప్పారావుకు బోన్ క్యాన్సర్ రావడంతో వైద్యం కోసం తమ స్తోమతకు మించి ఖర్చు చేశారు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో పూట గడవడం కష్టంగా మారింది. కరప బేడ, బుడగ సంఘం అధ్యక్షుడు బైలపాటి నూకరాజు ఆ కుటుంబ పరిస్థితిని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలుకు తెలియజేశారు. ఆయన మానవత్వం స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజును సంప్రదించగా 26 కిలోల బియ్యం, అవసరమైన నిత్యావసరాలను సమకూర్చారు. వాటిని శుక్రవారం మోటూరి అప్పారావు కుటుంబానికి మాజీ సర్పంచ్ తాతీలు, ఆ సంఘ అధ్యక్షుడు నూకరాజు అందజేశారు.

గ్రంథాలయాలకు కంప్యూటర్లు


స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్న మాస్టర్ ట్రైనర్ తేజదీవెన

బాలాజీచెరువు: శివశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రంథాలయాలకు రెండు కంప్యూటర్లు, స్మార్ట్ టీవీ, ఒక మొబైల్ ఫోన్ చొప్పున అందజేశారు. గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి సీహెచ్ వెంకటరావుకు శుక్రవారం కాకినాడ ప్రధాన గ్రంథాలయంలో మాస్టర్ ట్రైనర్ ఎ.తేజదీవెన వీటిని అందజేశారు. తొలి విడతలో ఎంపిక చేసిన 24 గ్రంథాలయాలకు అందజేశామని, మిగతా వాటికి త్వరలో ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కె.కిశోర్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాటక ప్రదర్శన కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తదితరులు

కాకినాడ లీగల్: బుద్ధుని బోధనలు అనుసరణీయమని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ నెల 26 స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ప్రదర్శించనున్న బుద్ధునితో నా ప్రయాణం డాక్టర్ అంబేడ్కర్ నాటక ప్రదర్శన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ నాటకాన్ని అందరూ తప్పనిసరిగా చూడాలని, బౌద్ధ ధమ్మ విశిష్టతను తెలుసుకుని ఆచరించి ప్రజలందరూ మంచి జీవితాన్ని పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పి.ప్రసన్నకుమార్, పితాని శ్రీనివాస్, ఎస్కే ఇజాజుద్దీన్, జేవీ రమణ, వి.రాజబాబు, టి.పృథ్వీరాజ్, వి.శ్రీనివాస్, రోహిణి, నాగభూషణం, సత్యనారాయణ, జె.అప్పారావు, పి.సుధీర్, నాటక ఆహ్వాన కమిటీ బాధ్యులు, కన్వీనర్ పి.రామారావు, కో–కన్వీనర్ పి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంక్ ప్రారంభం

కరప: గొర్రిపూడి గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన మంచినీటి ట్యాంక్, ఇంటింటా కుళాయిలను ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు. సాగునీటి సంఘ అధ్యక్షుడు జోకా అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భౌబోయ్..

- హడలెత్తిస్తున్న వీధి కుక్కలు
- ఎక్కడ చూసినా గుంపులు
- ఒంటరిగా కనిపిస్తే దాడులు


కాకినాడలో గుంపులు, గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు



కాకినాడ సిటీ: 'భౌ'బోయ్ కుక్కలు... ఏ వీధి చూసినా గుంపులు గుంపులు.. జనం వెంట పరుగులు.. రాత్రిళ్లు ఒంటరిగా కనిపిస్తే దాడులు.. ఇలా వీధి కుక్కల సంచారం రానురాను పెరిగిపోయింది. ఈ సమస్య జిల్లా కేంద్రం కాకినాడలో చేయిదాటింది.. ఈ సంతతి నియంత్రణకు వీటికి కొన్ని నెలలుగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిలిచిపోవడంతో సమస్యగా మారింది.. ఫలితంగా నగరంలో జనసంచారం లేని రోడ్డు ఉందేమో గానీ, వీధి కుక్కలు లేని రోడ్డు లేదంటే అతిశయోక్తి కాదనట్టు పరిస్థితి తయారైంది. రాత్రుళ్లు వాహనాలను వెంబడించి మరీ దాడి చేస్తున్నాయి. పగటి పూట సైతం చిన్నారులు కనిపిస్తే గాయపరుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వీధి కుక్కల దాడుల్లో చిన్నారులు మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకోవడంతో కాకినాడ నగరం, రూరల్ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు వణికిపోతున్నారు. ఆయా చోట్ల మొత్తం 12 వేల నుంచి 20 వేల పైబడి కుక్కలు ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో భౌ... భౌ అని వినిపిస్తేనే భీతిల్లిపోతున్నారు. కాకినాడ నగరంతో పాటు రూరల్ మండలంలోని గ్రామాల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కల బెడద ఎక్కువైంది. రాత్రివేళ ఇంటి నుంచి బయటకు రావాలన్నా, పగలు సైతం జనసంచారం తక్కువగా ఉన్న సమయంలో ప్రజలు భయపడిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లి, వచ్చే రైతులు, నగర శివారు ప్రాంతాల్లో రాకపోకలు సాగించే వారు, ఇంటి ముందు ఒంటరిగా ఆడుకునే చిన్నారులు, వాహనాలపై వెళ్లేవారు, ఎవరు కనిపిస్తే వారిపై ఎగబడి రెక్కేస్తున్నాయి. ఇటీవల ఏటిమొగ ప్రాంతంలో వేటకు వెళ్లి వస్తుండగా ఒక వ్యక్తిని కుక్కలు కరిచేశాయి. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. అయినా కార్పొరేషన్, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

నగరం.. గ్రామ సింహాల విహారం

కాకినాడ నగరంలో 50 డివిజన్లు ఉన్నాయి. గతంలో కేవలం శివారు ప్రాంతాల్లో మాత్రమే కుక్కలు కనిపించేవి. ఏదైనా పనిపై శివారు ప్రాంతాలకు వెళ్లాలంటే అక్కడ కుక్కలుంటాయి, కరుస్తాయని ప్రజలు భయపడేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. నగరంలో ఏ డివిజన్లో చూసినా కుక్కలే కుక్కలు. గుంపులుగా తిరుగుతూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. నగరంలో జగన్నాథపురం, ఏటిమొగ, ముగ్గుపేట, కొత్తకాకినాడ, అన్నమ్మఘాటీ, బాలాజీ చెరువు, ముత్తానగర్, మహాలక్ష్మినగర్, కొత్తపేట మార్కెట్ కొత్తకాకినాడ, సాంబమూర్తినగర్, పర్లోవపేట, దుమ్ములపేట, సంజయ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రైల్వే స్టేషన్, కలెక్టరేట్, డీఎంహెచ్‌వో కార్యాలయాలు, జిల్లా కోర్టులు ఇలా చెప్పుకొంటూపోతే కుక్కలు లేని ఒక్క వీధి కూడా లేదని చెప్పవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలను పాఠశాలల్లో వదిలి తల్లిదండ్రులు పొలాలకు వెళ్తుంటారు. దీంతో చిన్నారుల భద్రతపై ఆందోళన చెందుతున్నారు. పల్లెల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో పిల్లలు స్కూల్ నుంచి ఒంటరిగా వచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనని భయాందోళన చెందుతున్నారు. పట్టణాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది.

పెరిగిన పెంపుడు జంతువులు

నగరం, గ్రామీణ ప్రాంతాల్లోనూ పెంపుడు కుక్కలు వేల సంఖ్యలో ఉన్నాయి. ప్రతి ఏడాది జూలై 6వ తేదీన నిర్వహించే జూనోసిస్ డే కార్యక్రమంలో పెంపుడు కుక్కల యజమానులు సుమారు 600 నుంచి 1000 మంది వరకూ వారి కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు చేయిస్తున్నట్లు పశు వైద్యులు చెబుతున్నారు. పెంపుడు కుక్కల సంగతి ఇలా ఉంటే వీధి కుక్కలను పట్టించుకునేవారే లేరు. ఈ కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన పురపాలక శాఖ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. దీంతో వీధి కుక్కలు కరిచినప్పుడు కొందరు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తోందంటున్నారు.

అటకెక్కిన బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం

కుక్కలు పెరగకుండా యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం నిర్వహించాల్సి ఉంది. ఇందులో భాగంగా మగ కుక్కలకు క్యాస్ట్రేషన్ చేస్తారు. ఆడ కుక్కలకు గర్భసంచి తీసేస్తారు. దీంతో పునరుత్పత్తి జరగదు. క్రమంగా కుక్కల సంఖ్య తగ్గిపోతుంది. అయితే కాకినాడ నగరం, రూరల్ ప్రాంతాల్లో ఎక్కడా ఏబీసీ ప్రోగ్రాం జరగడం లేదు. అధికారులు మాత్రం ఆపరేషన్లకు సిద్ధం చేశామంటూ చెబుతున్నారే తప్ప, వాస్తవానికి చర్యలు తీసుకోవడం లేదని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.

పందులే గుంపులుగా వస్తున్నాయ్..


రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో పందుల గుంపు

కాకినాడ రూరల్: పందుల సంచారం విసుగు పుట్టిస్తోంది.. జనానికి ఇబ్బంది తెచ్చిపెడుతోంది. సీజనల్ వ్యాధుల ప్రభావం ఉండే వర్షాకాలంలో గ్రామాల్లో పందుల సంచారం భయాందోళనకు గురిచేస్తుంది. కాకినాడ రూరల్‌లో రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల తదితర గ్రామాల్లో వీటి బెడద ఎక్కువైంది. గుంపులుగా గుంపులుగా రోడ్ల పైకి రావడంతో ఒక్కోసారి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పందులను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

విశ్వమానవ హక్కుల దినోత్సవం

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామంలో అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో ఇంగ్లిషు విభాగం ఆధ్వర్యంలో నెల్సన్ మండేలా జయంతిని పురస్కరించుని శుక్రవారం విశ్వమానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్, ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ, ఎం.పోచయ్య, రాధామాధవి తదితరులు నెల్సన్ మండేలా చిత్రపటానికి నివాళులర్పించారు.

అమ్మా పాహిమాం..

- ఆకట్టుకున్న శాకంబరి అలంకరణ
- భారీగా తరలివచ్చిన భక్తులు


పెద్ద శివాలయంలో..


శివాలయంలో కూరగాయలు, పండ్లతో రూపొందించిన శివలింగం


శాకంబరి అవతారంలో సంతచెరువు కనకదుర్గమ్మ

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. సుమారు ఆరు టన్నుల కూరగాయలతో ఆలయ పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. వంకాయలు, బెండకాయలు, క్యాప్సికం, బెండకాయలు, అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన గోంగూర, కరివేపాకుతో పాటు వివిధ రకాల పండ్లతో అమ్మవారి గర్భాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ సుమారు 100 మంది భక్తుల సాయంతో ఆలయాన్ని అందంగా అలంకరించామని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని జిల్లా దేవదాయశాఖాధికారి కనపర్తి నాగేశ్వరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలోని ఉషారాజరాజేశ్వరి అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. సంతచెరువు కనకదుర్గమ్మ అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో శోభాయమానంగా అలంకరించారు.

కాకినాడ సిటీ: తూరంగి డ్రైవర్స్ కాలనీలోని దుర్గాదేవి అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సంతచెరువులో..

కాకినాడ సిటీ: స్థానిక సినిమారోడ్డు సంత చెరువు వద్ద ఉన్న కనకదుర్గమ్మ వారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి జోకా సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ సుంకర సురేష్‌బాబు పర్యవేక్షించారు.

విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు


నాగమల్లితోట జంక్షన్ వద్ద ఎస్వీ రంగారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాకినాడ రూరల్: విశ్వనట చక్రవర్తిగా ఎస్వీ రంగారావు కీర్తి గడించారని వైఎస్సార్ సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటరు కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు ఎస్వీఆర్ 59వ వర్ధంతిని కాకినాడలో శుక్రవారం నిర్వహించారు. నాగమల్లితోట జంక్షన్ సమీపంలోని ఐదు భవనాల కూడలిలో ఎస్వీ రంగారావు కాంస్య విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూల మాలలు వేశారు. తెలుగుతో పాటు అనేక భాషల్లో తన నటనతో ఆకట్టుకున్న ఎస్వీ రంగారావు భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన చిత్రాల ద్వారా సజీవంగా ఉన్నారని రావూరి వెంకటేశ్వరరావు, నాగమణి అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్వీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఎఫ్‌సీఐ రిటైర్డ్ జనరల్ మేనేజర్ ప్రసాద్‌నాయుడు, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, డాక్టర్ వేదుల శిరీష, సత్యనారాయణ రాజు, ఓం నమశ్శివాయ, త్రిమూర్తులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అందని ప్రయోజనాలు


ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న జిల్లా అంగన్‌వాడీ ప్రతినిధులు

కాకినాడ సిటీ: ఐసీడీఎస్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయినా అంగన్‌వాడీలకు ఏ ప్రయోజనాలు అందడం లేదని వాపోయారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కాకినాడలో ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. పోషన్ ట్రాకర్, బాల సంజీవని యాప్ అని లబ్దిదారులను, అంగన్‌వాడీ కార్యకర్తలను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. నాలుగేళ్ల క్రితం సెల్‌ఫోన్లు ఇచ్చారని, అవి పని చేయడం లేదని, సొంత మొబైల్ తీసుకుని వంద శాతం పని చేయాలని అధికారులు ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. యాప్‌లలో పనులు చేస్తూ పిల్లలకు ప్రీస్కూల్ చెప్పడానికి సమయం ఉండటం లేదని వారు ఎంపీకి వివరించారు. ఈ నెల 22 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అంగన్‌వాడీల సమస్యలపై మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి, నాయకురాళ్లు ఎంకే జ్యోతి, వీరమణి, వరలక్ష్మి, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయండి


పాత పెన్షన్ విధానం అమలు చేయాలని వినతి ఇస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎస్ అమల్లోకి రాక ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియమితులైన 2003 ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వో వెంకటరావుకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కన్వీనర్ కేఎస్ఎస్ జయరామ్ మాట్లాడుతూ సీపీఎస్ విధానం అమలు కంటే ముందుగా నియమితులైన 11 వేల మందికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో రాష్ట్రంలోని అన్ని జేపీసీల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు మద్దతునిచ్చి పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నగేష్, ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు చలపతి, ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ సంఘ నాయకులు డీఎస్సీ–2003 ఫోరం కన్వీనర్లు టి.జయకృష్ణారెడ్డి, వి.శ్రీనివాసులురెడ్డి, ఒ.పెద్దిరాజు, సీహెచ్ లక్ష్మి, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీపీగా ధనంజయ


బొండా ధనంజయ

కాకినాడ లీగల్: కాకినాడ ఆరో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా న్యాయవాది బొండా ధనంజయను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విధులకు మూడేళ్ల కాలపరిమితిని నిర్ణయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ధనంజయను ఏపీపీగా నియమించడంతో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం, జనరల్ సెక్రటరీ చక్కా వీరభద్రరావు (చంటి), న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఆర్థిక చేయూత

బోట్‌క్లబ్: తనతోపాటు చిన్ననాడు కలసి చదువుకున్న మిత్రుడు కుటుంబం ఆపదలో ఉందని తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. నగరానికి చెందిన కేఎస్ కృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు చిన్ననాటి స్నేహితులు. ఇటీవల కృష్ణారెడ్డి మృతి చెందడంతో అతని కుమార్తె హర్ష మాధురి చదువుకోవడానికి ఇబ్బందులు పడుతుంది. ప్రస్తుతం హర్షమాధురి ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని పరిస్థితిని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం రూ. 25 వేల చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణ్‌మూర్తి పాల్గొన్నారు.

ఖైదీలకు వైద్య, ఆరోగ్య పరీక్షలు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్

కాకినాడ క్రైం: స్థానిక సబ్ జైలులో వివిధ నేరాల్లో శిక్షలు అనుభవిస్తున్న 85 మంది ఖైదీలకు జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. టీబీ స్క్రీనింగ్, సిఫిలిస్, హెపటైటిస్ బీ, హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి ఏడుగురి రక్త నమూనాలు పరీక్షలకు పంపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్ మాట్లాడుతూ, డీఎంహెచ్ఓ నరసింహ నాయక్ పర్యవేక్షణలో జిల్లాలో జూన్ 2న ప్రారంభించిన టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా తాజా పరీక్షలు నిర్వహించామన్నారు. టీబీ వ్యాధి కారణంగా మరణాలు తగ్గించి, కొత్త కేసులు నమోదు కాకుండా చూడడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు.

పోర్టు భద్రతకు పటిష్ట చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: స్థానిక పోర్టు భద్రతకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోర్టు రక్షణపై పోర్టు అధికారులు, కోస్టుగార్డు, మెరైన్, కస్టమ్స్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, కేఎస్‌పీఎల్, జిల్లా పోలీస్ అధికారులతో కలసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోర్టు భద్రత తమ ప్రాథమిక విధి అని పేర్కొంటూ, దానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. పోర్టు పరిసరాలన్నీ సీసీ, డ్రోన్ కెమెరాల నిఘాలో ఉన్నాయని తెలిపారు. చమురు అక్రమ రవాణాను నియంత్రించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో అనుమానితులు, అనుమానాస్పద పడవలను పూర్తి స్థాయిలో పరిశీలించాలని సూచించారు. కోస్టుగార్డు, మెరైన్, కస్టమ్స్, పోర్టు పీఎస్ విభాగాలు కలసి గస్తీ నిర్వహించాలన్నారు. పోర్టు లోపలి ఎగుమతి దిగుమతులపై నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో కాకినాడ ఎస్‌డీపీఓ దేవరాజ్ మనీష్ పాటిల్, పోర్ట్ ఆఫీసర్ ధర్మశాస్త్ర, కేఎస్‌పీఎల్ నుంచి ఎస్ఎల్ శ్రీనివాస్, కోస్టుగార్డ్ పోలీస్ అధికారి దివాకరం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై తూతూమంత్రంగా సమీక్ష

- అక్రమాలను పక్కనబెట్టిన వైనం


ఉపాధి పనుల సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై అధికారులు జరిపిన సమీక్ష తూతూ మంత్రంగా సాగిందని సర్పంచులు విమర్శిస్తున్నారు. 12 మంది డీఆర్పీలు గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. డీఆర్పీలు గుర్తించిన అవకతవకలు పక్కన పెట్టేసి, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఏపీడీ పి.వసంత మాధవి, జిల్లా విజిలెన్స్ అధికారి, డ్వామా ఫైనాన్స్ మేనేజర్ పి.విజయభాస్కర్, సోషల్ ఆడిట్ అకౌంటబిలిటీ మేనేజర్ జి.రాజేష్ తదితరులు బహిరంగ సమీక్ష జరిపిన తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాలువ పనుల్లో కొలతలు సక్రమంగా లేకపోవడం, పనికి రాకపోయినా మస్తర్లు వేయడం, చాలా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు మస్తర్లు ఇష్టానుసారంగా మార్చేసి సొమ్ము కాజేసినట్టు గుర్తించారు. 23 గ్రామాల్లో సుమారు రూ.1.42 కోట్లు పక్కదారి పట్టినట్టు గుర్తించి నివేదిక ఇస్తే, అధికారులు ఉపాధి పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లను వెనకేసుకువచ్చి రూ.26 వేల అపరాధ రుసుం, రూ.13,386 రికవరీకి ఆదేశాలు ఇచ్చారు. ఇలాగైతే డీఆర్పీలు రెండు వారాలకు పైగా తనిఖీలు చేయించడం ఎందుకని మండల వాసులు విమర్శిస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో కూడా జరుగుతున్న అవకతవకలను గుర్తించారు. అయినా అధికారులు వాటినీ పట్టించుకోలేదు. ఉదాహరణకు కొంగోడులో ఆశ వర్కర్‌కు పింఛన్, గొర్రిపూడిలో అంగన్‌వాడీ టీచర్‌కు పింఛన్ నిబంధనలకు విరుద్ధంగా ఇస్తున్నట్టు డీఆర్పీలు గుర్తించారు. కొంగోడులో ఒక మహిళ భర్త ఉన్నా ఒంటరి మహిళ పింఛన్, వేములవాడలో భర్త ఉన్నా వితంతు పింఛన్ తీసుకుంటున్నట్టు తెలుసుకున్నారు. అరట్లకట్టలో ఒకరు పెరాలిసిస్(బెడ్ పేషంట్) పింఛన్ రూ.15 వేలు తీసుకుంటున్నాడు. అయితే ఇతను ఉపాధి పథకంలో 100 రోజులు పనిచేసి, వేతనం పొందాడని సమాచారం. అలాగే వేళంగిలో మరొకరు పెరాలిసిస్ పింఛన్ తీసుకుంటూ మంచంపై ఉండాల్సిన అతను దర్జాగా తిరుగుతున్నాడు. డీఆర్పీలు ప్రతి ఇంటినీ జల్లెడపట్టి బయటపెడితే సోషల్ ఆడిట్ అధికారులు అవేమీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది.

గ్రామాల వారీగా అవినీతి బాగోతం

మండలంలోని యండమూరులో రూ.2,81,659, జి.భావారంలో రూ.59,027, పెనుగుదురులో రూ.3,48,860, పాతర్లగడ్డలో రూ.8,28,366, వేములవాడలో రూ.1,05,751, వలసపాకలలో రూ.5,35,834, సిరిపురంలో రూ.1,65,107, వేళంగిలో రూ.27,23,925, పెద్దాపురప్పాడులో రూ.5,69,450, విజయరాయుడుపాలెంలో రూ.2,54,672, గురజనాపల్లిలో రూ.5,09,340, వాకాడలో రూ.21,607, కరపలో రూ.10,61,770, నడకుదురులో రూ.9,25,981, కూరాడలో రూ.49 వేలు, పెదకొత్తూరులో రూ.65 వేలు, జెడ్.భావారంలో రూ.9,56,837, కొరిపల్లిలో రూ.4,51,665, అరట్లకట్టలో రూ.3,19,685, గొడ్డటిపాలెంలో రూ.24,364, గొర్రిపూడిలో రూ.23,94,255, కొంగోడులో రూ.16,16,307 మేర అక్రమాలు జరిగినట్టు డీఆర్పీలు గుర్తించినట్లు సమాచారం. ఈ నివేదికలు పక్కన పెట్టేశారు. సోషల్ ఆడిట్ సమీక్షపై దర్యాప్తు జరిపితే అవకతవకలన్నీ బయటకు వస్తాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆలోచింపజేసిన నాటికలు


దేవరాగం నాటికలోని ఓ సన్నివేశం

బోట్‌క్లబ్: అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ రజతోత్సవాల్లో భాగంగా స్థానిక సూర్యకళా మందిరంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం సౌజన్య కళాస్రవంతి విశాఖ వారిచే దేవరాగం నాటిక ప్రదర్శించారు. అనంతరం చిలకలూరిపేటకు చెందిన మద్దుకూరి క్రియేషన్స్ వారిచే మా ఇంట్లో మహాభారతం నాటిక ఆకట్టుకుంది. తర్వాత తాడేపల్లి వారి విడాకులు కావాలి నాటిక ప్రదర్శన జరిగింది. నేటి సమాజంలో జరుగుతున్న విషయాలు, కుటుంబ బంధాలు, భార్యాభర్తల అనుబంధాలకు బీటలుగా మారుతున్న మనస్పర్థలను చక్కగా వివరించారు. ఈ సందర్భంగా పేరూరు చినసత్యనారాయణచే తాండ్రపాపారాయుడు ఏకపాత్రాభినయం అలరింపజేసింది. సంస్థ అధ్యక్షుడు అచ్యుతరామారెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు తదితరులు పాల్గొన్నారు.